క్లుప్తంగా

లూయీ బ్రెయిలీ జయంతిని జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఈనెల 21వ తేదీన నిర్వహించే 215వ లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జాతీయ అంధుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నాగేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే అంధులకు మూడు పూటల ఉచిత భోజనం సౌకర్యంతోపాటు పలు క్రీడాంశాలలో ఆటల పోటీలు నిర్వహించడం, ఆర్టీసీ వారిచే బస్‌పాస్‌లు ఇప్పించడం జరుగుతుందన్నారు. అంధులు అందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. మరింత సమాచారం కోసం 73965 76847,94405 21108 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలతోనే ఆరోగ్య భాగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ నాగశ్రీలక్ష్మి

సంబేపల్లె : క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఒత్తిడి అధిగమించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఎంపీపీ నాగశ్రీలక్ష్మి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం సంబేపల్లె మండలంలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లకు స్థానిక సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు, పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

పుల్లంపేట : వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముద్దా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దొండ్లోపల్లి హరిజనవాడ, అరుంధతివాడ, కొమ్మనవారిపల్లి హరిజనవాడ, అరుంధతివాడ, వల్లూరుపల్లి, చొప్పావారిపల్లి గ్రామాలలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో దొండ్లోపల్లి సర్పంచ్ మణి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గౌడన్నకి చేయూత క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

రాజంపేట రూరల్ : గౌడ(ఈడిగ) సంఘం క్యాలెండర్‌ను గౌడన్నకి చేయూత జిల్లా చెర్మన్ మన్నెం రామ్మోహన్ గౌడ్ సంగం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరణ చేశారు. స్థానిక గౌడ సంఘం కార్యాలయం వద్ద బుధవారం గౌడ సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. రామ్మోహన్‌గౌడ్ ముందుగా సంఘం క్యాలెండర్ అనంతరం గౌడన్నకి చేయూతను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలకు ఈడిగలకు గత 3 సంవత్సరాలుగా విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం తమవంతు సహకారం అందించామన్నారు. ఇక ముందు కూడా సహకారం అందిస్తామని తెలియజేశారు. సమావేశంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కంపరాజు కొండయ్య గౌడ్, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, ట్రెజరర్ వి.భువనేశ్వర్‌గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు బండారు రెడ్డి శేఖర్‌గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి దొంతా సురేష్‌గౌడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న పార్లమెంటు, అసెంబ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జోన్-4కు సంబంధించిన ఉమ్మడి కడపజిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పద్మావతమ్మను ఉరవకొండ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కడప కలెక్టరేట్ ల్యాండ్-1 సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇ.ప్రతాప్‌రెడ్డిని గుడిబండకు బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్ భూ విభాగం-2 సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.భారతిని పుట్టపర్తికి బదిలీ చేశారు. అన్నమయ్య కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జి.నాగభూషణాన్ని నల్లమాడకు, డి.శ్రావణిని ధర్మవరానికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.భూషణంను చాపాడు మండలానికి బదిలీ చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని జి.పుణ్యవతిని సుండుపల్లె తహసీల్దార్‌గా నియమించారు. సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే ఎ.శ్రీనివాసులును పుల్లంపేటకు బదిలీ చేశారు. అదేవిధంగా ఆ జిల్లా కలెక్టరేట్ భూ విభాగంలో పనిచేసే టి.ఆనంద్‌కుమార్‌ను రామాపురం తహసీల్దార్‌గా నియమించారు.

22న ముగ్గుల పోటీలు

మదనపల్లె సిటీ : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్త్రీలకు ముగ్గుల పోటీలు, చిన్న పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అందరికీ సౌకర్యంగా షాదీఖానా అభివృద్ధి

- పట్టణంలో పలు అభివృద్ధి పనుల పరిశీలన
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు



షాదీఖానాలో మరమ్మతుల విషయమై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని షాదీఖానాకు మరమ్మతులు చేపట్టి త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలోని షాదీఖానాను శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మున్సిపల్, ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి పరిశీలించారు. షాదీఖానాలోని గోడలు, కిటికీలు, స్లాబ్, టాయిలెట్లు తదితర విభాగాల గురించి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకట సుబ్బయ్య, ఏఈ గిరీశ్వరరావు మున్సిపల్ డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ క్రిష్టా రెడ్డిలతో చర్చించి మరమ్మతులకు త్వరితగతిన ఎస్టిమేషన్‌లను తయారు చేయాలని సూచించారు. పేదలు, దిగువ, మధ్య తరగతి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా షాదీఖానాను అభివృద్ధి చేస్తామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్ ఆర్‌సిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తిచేయాలి

రాయచోటి – సుండుపల్లె మార్గంలోని ఠాణా నుంచి రింగురోడ్డు వరకు జరుగుతున్న నాలుగు వరుసల రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ చైర్మన్‌తో కలసి రహదారి విస్తరణ పనులు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, ఎస్‌హెచ్ డ్రైన్, ఠాణా వద్ద సిగ్నల్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. షిఫా ఆసుపత్రి ఎదుట కూడా డ్రైనేజీ నిర్మాణ పనులను కూడా సమయానికి చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, తబ్రేజ్‌ఖాన్, అన్నా సలీం, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, శ్యామ్‌కుమార్, జానం రవీంద్ర, జయన్న నాయక్, భాస్కర్, గువ్వల బుజ్జిబాబు, నవరంగ్ నిస్సార్, జనతా బషీర్, అయ్యవారురెడ్డి, రౌనఖ్ హుస్సేన్, జాకీర్, ఫయాజ్ అహమ్మద్, గౌస్‌ఖాన్, హజరత్ ఖాదర్‌వలీ, కొత్తపల్లె ఇంతియాజ్, నవాజ్ క్రిష్, జావీద్, అమీర్, యూసూఫ్, ఇర్షాద్, ఇస్లాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగం రాయల పాలన

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



శ్రీకృష్ణదేవరాయలు జయంతిలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి

రాజంపేట : శ్రీ కృష్ణదేవరాయలు పాలన తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగమని జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి నేతృత్వంలో రాజంపేట పాత బస్టాండులోని శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకలలో స్థానిక మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాయల కాలంలో తెలుగుభాష పరిడవిల్లిందన్నారు. సమర్థుడైన పాలకుడిగా రాయలకు పేరుందన్నారు. మారుమూల పల్లెటూర్లకు సైతం రాయల పాలన ప్రయోజనాలు అందాయన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా మాట్లాడుతూ రాయలు విశిష్ట పాలకుడన్నారు. కళాభిమాని, కళా సాహిత్యపోషితునిగా రాయలు ఖ్యాతి నలుదిశలా వ్యాపించిందన్నారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి మాట్లాడుతూ ఏపీ దక్షిణ ప్రాంతంలో ఐదు జిల్లాల్లో కూడిన ప్రాంతం ఆయన పేరుమీదనే రాయలసీమగా పేరొందిదన్నారు. రాయల విజయాలు సైనికచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయమన్నారు. అటువంటి రాయలను జయంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం భాగ్యమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, కాపు నేతలు గునకల సుబ్బరాయుడు, అరిగె మణి, అరిగెల సౌమిత్రి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత మిరయాల సురేఖ, మైనార్టీ నేత ఆసీఫ్, నాయకులు డీలరు సుబ్బరామిరెడ్డి, పెంచలయ్య, సొంబెత్తిన శ్రీను, రోళ్లమడుగు సుబ్బరాజు, జ్యోతి, కౌన్సిలర్ తంబా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో పాతబస్టాండు సర్కిల్‌లో వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

ఉర్దూ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి



మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న రూటా నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరింపజేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) నేతలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంలకు విన్నవించారు. బుధవారం వారు పై నేతలను వేర్వేరుగా వారి కార్యాలయాలలో కలుసుకుని తమ సమస్యలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఉర్దూ డైట్ కళాశాలలో అధ్యాపకులను వెంటనే నియమింపచేయాలన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ కోరారు. 117 జీఓకు సంబంధం లేకుండా ఉర్దూ హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులు ఉండేలా చూడడం, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమింపచేయాలంటూ విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే, డిప్యూటీ చైర్‌పర్సన్‌లు సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేసేందుకు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూటా మహమ్మద్ ఆయూబ్, మహమ్మద్ హమీం, జాఫరుద్దీన్, మహమ్మద్ ఆలీ, సబాతుర్ రహిమాన్, ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీ కోదండరామాలయానికి తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చేజర్ల ఇంద్రకుమార్ రాజు రూ.2లక్షల విరాళాన్ని ప్రకటించారు. బుధవారం నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించిన ఆయన్ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. నందలూరులో ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన్ను ఎస్ఆర్ఐ ఆకుల చలపతి ఆలయానికి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఇంద్రకుమార్ రాజు తనవంతుగా రూ. 2 లక్షలు రెండు, మూడు రోజులలో అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు గంపా సుధాకర్, డాక్టర్ అరిగె రాంప్రసాద్, సుధాకర్, పల్లె నాగయ్య, నారపుశెట్టి వేణు, మహేష్, విశ్రాంతి ఉపాధ్యాయుడు నరసింహారావు, నారపుశెట్టి శివ, దుష్యంత్, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర



పథకాలను వివరిస్తున్న అధికారులు

రాజంపేట రూరల్ : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని పెద్దకారంపల్లి పంచాయతీలో మండల అధికారులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పంపిన వ్యాన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాల గురించి వివరించారు. అర్హులైన వారు వాటిని ఎలా పొందాలో తెలియజేశారు. డ్రోన్ ద్వారా పొలాలకు మందులు పిచికారీ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ టి.హరిప్రసాద్ రెడ్డి, పీఎస్ ఆర్‌వీ శ్రీకాంత్, ఆకేపాడు పీహెచ్‌సీ వైద్యులు నరేష్, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరయ్య, సర్పంచ్ అచ్చమ్మ, ఉపసర్పంచ్ వెంకటరాజు, ఎంపీటీసీ ఎ.వరదరాజు, వైద్య బృందం, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

గాలివీడు : చదువుల రాణిస్తున్న విద్యార్థిని పద్మప్రియకు గాలివీడు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆర్య శంకర్ ఆర్థికసహాయం అందించారు. గత 10వ తరగతి ఫలితాల్లో బాలిక ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి ఐఐఐటీలో సీటు సాధించింది. రూ.5వేలు నగదును కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వేమనాయుడు, కరుణాకర్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతరలు

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె కస్బాలో బుధవారం గుండు గంగమ్మ, గౌరమ్మ తల్లుల జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. జాతరలో భాగంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తీర్చుకున్నారు. ప్రతి యేడు జాతరను కనుమ రోజున నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు పందోళ్లపల్లి బలరామయ్య తెలిపారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచేకాక ఇతర మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామ పురవీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లి శివారులోని వాగులో నిమజ్జనం చేశారు.

స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలివెళ్దాం

రాజంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డా.బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతి వనం ప్రారంభోత్సవానికి పెద్దఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ కరీముల్లా పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు అగ్రపీఠం వేసి గౌరవిస్తున్నారన్నారు. మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున సామాజిక న్యాయం మహాశిల్పంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసి చరిత్రలో నిలిచారన్నారు. అట్టడుగు వర్గాల కోసం అలుపెరగని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండేలా ఈనెల 19న అంబేడ్కర్ స్మృతి వనం విజ్ఞప్తి చేశారు.

విగ్రహావిష్కరణకు తరలివెళ్దాం

పుల్లంపేట : విజయవాడలో జరగబోయే రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎస్సీసెల్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తలంచి నిర్మించిన బాబాసాహెబ్ విగ్రహావిష్కరణ ఈ నెల 19న జరుగనుందని ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వెలిగల్లు పార్కు అభివృద్ధి పట్టదా?



వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టులోని పార్కును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గాలివీడు : మండలంలోని వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలోని పార్కును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ నాయకులతో కలిసి పార్కు పరిసరాలను పరిశీలించారు. మాట్లాడుతూ నిత్యం పార్కుకు వచ్చే సందర్శకులకు పార్కులో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ పార్కులో మురుగునీటితో ఈత కొలను, ఆట వస్తువులు శిథిలావస్థకు, విరిగిన బల్లలకు మరమ్మతులు చేయకపోవడం బాధాకరమన్నారు. కనీసం పార్కులో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతను పాటించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కులో పరిశుభ్రతతోపాటు మంచి వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు రూత్

ఓబులవారిపల్లె : పుట్టగొడుగులు పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సీహెచ్ రూత్ పేర్కొన్నారు. బుధవారం వైకోట గ్రామంలో ఐసీఏఆర్ఎస్సీ సబ్ ప్లాన్ కింద ప్రాజెక్టులో భాగంగా వైకోట గ్రామంలో పుట్టగొడుగుల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పుట్టగొడుగుల యూనిట్లను ప్రారంభించేలా మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఆచార్యులు సీహెచ్ రూత్ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో మంచి పోషకాలు ఉంటాయని, పుట్టగొడుగుల పకోడిలు, పుట్టగొడుగులు సూపు, పుట్టగొడుగుల ద్వారా పచ్చడి తయారు చేసుకోవచ్చని, వాటిలోని పోషకాలు ఎంతో విలువైనటువంటివని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు స్వరాజ్యలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గొబ్బెమ్మ' ఊరేగింపు



గొబ్బెమ్మ ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దవటంలో గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపులో స్థానిక మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొని గొబ్బెమ్మ పాటలను పాడారు. ఈ పండుగ రోజున ముగ్గులు వేసి ముగ్గులో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో అలంకరిస్తారన్నారు. ముగ్గులో పెట్టే గొబ్బెమ్మను గోదాదేవిగా పూజిస్తారన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు రెండూ లక్ష్మీదేవికి చాలా ఇష్టమైనవన్నారు. పండుగ రోజుల్లో ముగ్గు మధ్యలో గొబ్బెమ్మను పెడితే ఇంట్లోకి లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లేనని మహిళల్లో విశ్వాసమున్నట్లు స్థానిక మహిళలు తెలిపారు.

సంక్రాంతి సంబరాల్లో ప్రభుత్వ విప్



గొబ్బెమ్మకు పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని బొజ్జవారిపల్లి పంచాయతీ బంగ్లామిట్టలో జరిగిన సంక్రాంతి ఆఖరి రోజు గొబ్బిళ్ల మహోత్సవంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మలు గిరిజనులతో కలిసి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలలో భాగమైన సంక్రాంతి మహోత్సవాలు గిరిజన గ్రామాలలో ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా సుఖసంతోషాలతో సంక్రాంతిని జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మావిళ్ల సుబ్బయ్య, మాజీ సర్పంచ్ మావిళ్ల సుబ్రమణ్యం, సిద్దు రాయల్, పెద్దఎత్తున నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కేసీ పల్లె జట్టు



కేసీ పల్లె జట్టుకు ట్రోఫీని అందిస్తున్న నిర్వాహకులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : గత కొన్ని రోజులుగా ఉత్కంఠగా సాగిన తలమంచి గిరీష్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ముగిసింది. మండల కేంద్రంలో జరిగిన టోర్నీ ఫైనల్‌లో పెనగలూరు మండలం కోడి చెన్నాయిగారిపల్లె జట్టు, కోడూరు జట్లు తలపడ్డాయి. ఆసక్తిగా సాగిన ఈ పోరులో కోడిచెన్నాయిగారిపల్లె జట్టు విజేతకు నిలిచి రూ.లక్ష నగదు బహుమతిని గెలుపొందింది. రన్నరప్‌కు రూ.50వేలు దక్కించుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకుడు గిరీష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ జిల్లాస్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండలస్థాయిలో వాలీబాల్ పోటీలను కూడా నిర్వహించామన్నారు. విజేతగా నిలిచిన పెనగలూరు జట్టుకు రూ.20వేలు, రన్నరప్‌గా నిలిచిన నారాయణ నెల్లూరు జట్టుకు రూ.10వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్‌లు తలమంచి చంద్రభాను రెడ్డి, తలమంచి ధనుంజయరెడ్డి, దువ్వూరు రాఘవరెడ్డిలతోపాటు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : గ్రామాలలోని రైతుల భూ సమస్యలు ఆలస్యం కాకుండా తక్షణమే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలపై సాయికిషోర్ రెడ్డి రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. రైతులకు సంబంధించిన భూముల ఆన్‌లైన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. గాదెల, వెంకటాపురం గ్రామాల్లోని రైతుల భూముల సర్వే నిర్వహించాలని వారన్నారు. పలు సమస్యలపై తహశీల్దార్‌తో సాయికిషోర్ రెడ్డి చర్చించారు. అనంతరం తహసీల్దార్ పుల్లారెడ్డి స్పందిస్తూ రికార్డుల ప్రకారం పరిశీలించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు నారాయణరెడ్డి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడపాలని స్థానిక ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు లేని డిపోగా తీసుకురావాలన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మద్యం తాగి విధులకు హాజరు కారాదని సూచించారు. సిగ్నల్స్ అనుసరించి విధులు నిర్వర్తించాలన్నారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం, శుభప్రదమని ప్రయాణికులకు తెలియజేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

మదనపల్లె: మదనపల్లె మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు మెడికల్ కాలేజ్‌లో అనస్థీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కాగా, ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ మురళీధర్ మదనపల్లె మెడికల్ కాలేజ్‌లో ప్రొఫెసర్‌గా కొనసాగుతారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



ప్రణాళికపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అధికారులు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలను ఎలా అభివృద్ధి పథంలో నడిపించాలనే అంశాలపై చర్చించారు. అనంతరం పంచాయతీలో చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : గ్రామాలలో గ్రామ పంచాయతీ ప్రణాళికలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ శేఖర్‌నాయక్, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 2024 – 25 సంవత్సరానికి సంబంధించిన మండల, గ్రామ పంచాయతీల అభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో ముందస్తు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకొని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను ప్రణాళిక బద్ధంగా వాడుకొని గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపంచాలని కోరారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే వాటికి కచ్చితంగా ఒక ప్రణాళిక ముఖ్యమని తెలియజేశారు. శిక్షణలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొని ఈ రెండు రోజులలో జరిగే కార్యక్రమానికి తప్పక హాజరై గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పంచాయతీ ప్రణాళిక అభివృద్ధిపై రెండురోజుల శిక్షణా కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ బాలకుమార్, ఎంపీడీఓ వరప్రసాద్‌లు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిపై సచివాలయ సిబ్బంది ఓ ప్రణాళికను రూపొందించాలని వారు తెలిపారు. మీమీ పంచాయతీలలో ఎలాంటి పనులు చేయాలి అనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని, అందు కోసం ప్రత్యేకంగా ప్రణాళికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ పద్మభూషన్ రెడ్డి, పెనగలూరు పంచాయతీ సెక్రటరీ సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.